# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 80 EDITOR:CHERUKU UPENDAR, DATE : THURSDAY 20 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 80 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 20 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-


## మరో ఐదు రోజులు వానలే వానలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం నుంచి వచ్చే సోమవారం వరకు పలు జిల్లాల్లో భారీ వర్షం ఉందని వివరించింది. ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్,

మిగతా 2లో...

## అంతరిక్షంలో.. చంద్రుడి దరహాసం



- విజయవంతంగా చంద్రయాన్-3 ఇస్రో ప్రయోగం
- ఉపగ్రహం చంద్రుడి వైపుగా తన ప్రయాణం : ఇస్రో ఛైర్మన్ సోమనాథ్
- ఆగస్టు 23, 24 తేదీల్లో చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ అవుతుందని అంచనా

నెల్లూరు- ప్రభాత సూర్యుడు

ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ 3 ప్రయోగాన్ని ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించి చంద్రుడి వైపుగా తన ప్రయాణాన్ని మొదలు పెట్టింది. తాజాగా చంద్రయాన్ అంతరిక్షంలో ప్రయాణిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటలీలోని మన్సియానోకు చెందిన వర్చువల్ టెలిస్కోప్ ప్రాజెక్ట్ అంతరిక్షంలో తిరుగుతూ చంద్రుడి వైపు ప్రయాణిస్తున్న చంద్రయాన్-3ను చిత్రీకరించింది. అందులో చంద్రయాన్-3 ఓ చుక్కలా వేగంగా ప్రయాణిస్తోంది. భూమికి 341 కిలోమీటర్ల ఎత్తులో చంద్రయాన్-3 కదలికలను వర్చువల్ టెలిస్కోప్ గుర్తించింది.

మిగతా 2లో...

## వ్యతిరేక కూటములు ఎప్పటికీ గెలవబోవు

### ప్రతి పక్షాల ఇండియా కూటమిపై ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

వ్యతిరేకతపై రూపొందించిన కూటములు ఎప్పటికీ గెలవబోవని ప్రతి పక్షాల ఇండియా (ఎ.ఔ.ఆ.ఎ.ం) కూటమిని ఉద్దేశించి పరోక్షంగా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శల దాడి చేశారు. కూటమి కుటుంబ, అవినీతిపరమైనప్పుడు దేశం నష్టపోతుందని అన్నారు. ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. కానీ పేదలు,

మిగతా 2లో...

## ప్రియాంక టూర్ వాయిదా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఈనెల 20వ తేదీన ఏఐసీసీ నాయకురాలు ప్రియాంక గాంధీ నాగర్‌కర్నూలు పర్యటించాల్సి ఉండగా.. ఆ పర్యటన వాయిదా పడింది. ఆరోజు నిర్వహించాలనుకున్న ర్యాలీతో పాటు బహిరంగ సభను కూడా వాయిదా వేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ప్రియాంక గాంధీ సమక్షంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర నేతలు పార్టీలో చేరాల్సి ఉంది. నెహ్రూ, గాంధీ కుటుంబ సభ్యుల్లో

మిగతా 2లో...

### నేటి నుంచి వర్షాకాల

## పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులపై ఉభయసభల్లో చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశాలు తొలిసారి పార్లమెంటు నూతన భవనంలో జరగనున్నాయి. పార్లమెంటు నూతన భవనంలోనే ఈ వర్షాకాల సమావేశాలు జరగ నున్నాయి. కొత్త భవనాన్ని మే 28వ తేదీన ప్రధాని మోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. జులై 20 తేదీ గురువారం నుంచి, ఆగస్ట్ 11వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగను న్నాయి. వచ్చే సంవత్సరం లోక సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఈ సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశం ఉంది.

మిగతా 3లో...

## కాంగ్రెస్ ప్లేస్‌లోకి బీజేపీ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ధాన్యం సేకరణ అంశంపై ప్రతీ సారి బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ అనే యుద్ధం జరిగేది. ఇందులో కాంగ్రెస్ అనే మాటే వినిపించేది కాదు. మోదీ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించారని.. అవమానించారని బీఆర్ఎస్ ధర్నాలు చేసేది. కేంద్రంలో తీసుకునే ప్రతీ నిర్ణయానికి విరుద్ధంగా తెలంగాణలో ధర్నాలు చేసి..బీజేపీపై యుద్ధం ప్రకటించేది.ఇలా రెండుపార్టీల మధ్య వార్ .. గత రెండు, మూడేళ్ల నుంచి సాగుతోంది. కానీ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మూడో స్థానంలోనే ఉండేది. అసలు ఇష్యూలో లేకపోవడమో..

మిగతా 2లో...

### జూనియర్ కాలేజీల్లో

## 1,654 లెక్చరర్ల నియామకం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 మంది అతిథి అధ్యాపకుల (గెస్ట్ లెక్చరర్లు) నియామకానికి సర్కార్ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఇంటర్మీడియెట్ కమిషనర్ నవీన్ మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నియామక మార్గదర్శకాలను ఆయన విడుదల చేశారు. జూనియర్ కాలేజీల్లో ప్రభుత్వం అతిథి అధ్యాపకులకు ఒక్కో పీరియడ్‌కు నిమిత్తం రూ.390 చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఐతే నెలకు గరిష్ఠంగా 72 పీరియడ్లకు మాత్రమే అనుమతి ఇచ్చింది. ఈ లెక్కన నెలకు రూ.28,080 చొప్పున వేతనం అందించనున్నట్లు వెల్లడించింది.జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి,

మిగతా 2లో...

## మరో బండి కాబోతున్నారా..!

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ రేసులోకి వచ్చిందని.. ఆ పార్టీ నేతలు సంబర పడుతున్నారు . బీజేపీ వెనక్కి వెళ్లిపోయిందని.. తాము బలపడ్డామని అనుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీ నేత అన్న మాటల్ని పట్టుకుని.. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ లేని విధంగా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమం ద్వారానే.. రేవంత్ అంటే.. ఎంత భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోనే కాంగ్రెస్ ఎన్నికలు ఎదుర్కోబోతోందని. తెలిసే.. బండి సంజయ్ విషయంలో చేసినట్లుగానే రేవంత్ నూ కార్నర్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని అంటున్నారు. మొత్తంగా తెలంగాణ రాజకీయాలు భిన్నంగా మారుతు న్నాయి. ఎవరి ఎవరిపై ఎలాంటి వ్యూహాలు పన్నుతున్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడుతోంది. వారు అలా అనుకోవడం కామనే. ఎందుకంటే పీసీసీ చీఫ్ కాంగ్రెస్ పార్టీ వ్యక్తి కాబట్టి. విచిత్రంగా బీఆర్ఎస్ నేతలు కూడా అదే అనుకుంటున్నారు. ఎన్నికల వరకూ రేవంత్ రెడ్డి పీసీసీ



చీఫ్ గా ఉండాలని కోరుకుంటున్నారు. ఆయనే ఉంటే బీఆర్ఎస్‌కు వంద సీట్లు వస్తాయని అనుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ఉచిత విద్యుత్ పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నర్సాపూర్ లో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి దూకుడుగా ఉంటారు. ఈ దూకుడులో ఆయన చేస్తున్న వ్యాఖ్యలను వివాదాస్పదం చేయడంలో బీఆర్ఎస్ విజయవంతం అవుతోంది. మూడు గంటలు మోటార్ ఆడిస్తే మూడు ఎకరాలకు

మిగతా 2లో...

## ఓయూలో విద్యార్థుల ఆందోళన



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. సిలబస్ పూర్తి కాకుండానే పరీక్షలు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. యూజీసీ రూల్స్ ప్రకారం సెమిస్టర్ కి కనీసం 120 పని దినాల తర్వాతే పరీక్షలు పెట్టాలి. కనీసం రెండు నెలలు కూడా పాఠాలు

మిగతా 2లో...

## వ్యతిరేక కూటములు ఎప్పటికీ గెలవబోవు

(మొదటిపేజీ తరువాయి)

వెనుకబడిన వర్గాలతో కూడిన భారత్ ఎన్డీయేతో ఉందన్నారు. ఎన్డీయే భేటీ అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే 25 ఏళ్లలో ఎన్డీఏ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.”దేశంలో స్థిరమైన పాలన అందించడానికే ఎన్డీఏ కూటమి. అద్వానీయే ఎన్డీఏకు మార్గదర్శకులు. ఎన్డీఏను నిర్మించింది వాజ్‌పేయ్, అద్వానీయే. కూటమిలోకి కొత్త మిత్రులకు స్వాగతం. ఎన్డీఏ పట్ల అన్ని వర్గాల్లో విశ్వాసం ఉంది. దేశ ప్రగతిలో ఎన్టీఏ పాత్ర అత్యంత కీలకం. దేశంలో ప్రజా వ్యతిరేక కూటములు ఎప్పుడు సఫలం కాలేదు. కాంగ్రెస్ కూటమి ప్రజావ్యతిరేక కూటమి. ఆత్మనిర్భర్, భారత్ పురోభివృద్ధి లక్ష్య సాకారానికి కృషి. దేశ ప్రజలు కొత్త సంకల్పంతో ముందడుగు వేస్తున్నారు. ఎన్డీఏకు కొత్త నిర్వచనం ఇచ్చిన ప్రధాని మోదీ. ఔ– న్యూ ఇండియా, ఆ– డెలవప్‌నేషన్, ం– యాస్పిరేషన్ ఆఫ్ పీపుల్. అన్ని వర్గాలకు ఎన్డీఏపై పూర్తి నమ్మకం ఉంది. అందరి కృషి వల్లే దేశం అభివృద్ధి పథంలో సాగుతుంది.” అని మోదీ అన్నారు.”ఎన్డీఏ హయాంలో 13.5 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు పైకి వచ్చారు. ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న ఇచ్చిన ఘనత ఎన్డీఏది. విపక్ష పార్టీలు నన్ను నీచుడు అని నిందిస్తున్నాయి. ఎన్డీఏ కూటమి ప్రాంతీయ ఆకాంక్షలు నెరవేరుస్తుంది. ఎన్డీఏ కూటమిలో చిన్న, పెద్ద పార్టీలంటూ తేడా ఏం లేదు. గాంధీ, అంబేద్కర్, లోహియా సిద్ధాంతాలను ఎన్డీఏ ఆచరిస్తుంది. ఆదివాసి మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత ఎన్డీఏది. అవినీతిని అంతం చేసేందుకు అన్ని మార్గాలు ఉపయోగిస్తున్నాం. మేకిన్ ఇండియా నినాదంతో దేశాన్ని అభివృద్ధి చేస్తున్నాం. సమిష్టి కృషితోనే ప్రభుత్వాలు ఏర్పాడుతాయి. వంశపారంపర్య, అవినీతి పార్టీల కూటమితో దేశానికి నష్టం. ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంతో ఎన్డీఏ కూటమి ఏర్పాటు కాలేదు. మరొకరికి శత్రువుగా ఉండేందుకు ఎన్డీఏ ఏర్పాటు కాలేదు. స్థిరమైన ప్రభుత్వం వల్లే ప్రపంచానికి మనపై నమ్మకం పెరిగింది. ప్రతిపక్షంలో ఉన్నా విలువలతో కూడిన రాజకీయాలు చేశాం. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యం. దేశ ప్రగతి నినాదంతోనే ఎన్డీఏ ముందుకు వెళ్తోంది. భవిష్యత్తులో ఎన్డీఏతో కలిసి వచ్చే పార్టీలను స్వాగతిస్తున్నాం. దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతుంది. దేశ ప్రజల ఆకాంక్షల నెరవేర్చడమే మా అజెండా. దేశప్రగతి కోసం శక్తివంచన లేకుండా పని చేస్తున్నాం. నవ భారత నిర్మాణం ఎన్డీఏ లక్ష్యం. దేశం తలవంచుకునే పనులు ఎన్డీఏ ఎప్పుడూ చేయదు. నిబద్ధతతో ప్రజలు తల ఎత్తుకునేలా పాలన సాగిస్తున్నాం.” అని మోదీ వెల్లడించారు.

## ప్రియాంక టూర్ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ఒకరు బహిరంగ సభలో పాల్గొనప్పుడు తాను కాంగ్రెస్ కండువా కప్పుకుంటే బాగుంటుందని భావించిన జూపల్లి.. కచ్చితంగా వారు హాజరు కావాలని పట్టుబట్టారు. కానీ ఏఐసీసీ అగ్రనేతలు బెంగళూరులో ప్రతిపక్ష పార్టీల సమావేశంలో బిజీగా ఉన్నారట. ఈక్రమంలోనే గాంధీ కుటుంబంలో ఎవరు, ముఖ్యంగా ప్రయాంక గాంధీ వస్తారా, రారా... వస్తే ఏరోజున వస్తారనేది ఇంకా చెప్పలేదు. దీని వల్లే ఈ పర్యటనను వాయిదా వేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా.. సీనియర్ నేత చింతలపల్లి జగదీశ్వర్‌రావుకు కొల్లాపూర్ అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వాలని కోరుతూ ఆ ప్రాంత స్థానిక నేతలు కోరుతున్నారు. కొల్లాపూర్ టిక్కెట్‌పై ఎలాంటి హామీ ఇవ్వకుండా జూపల్లిని రప్పించాలని అంటున్నారు. అయితే జగదీశ్వర్ రావు ఆదివారం కొల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహించి అనుచరులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి కూడా హాజరయ్యారు. జగదీశ్వర్ రావుకు టికెట్ ఇవ్వాలని పార్టీ కార్యకర్తలు డిమాండ్ చేయడాన్ని పరిశీలించి ఏఐసీసీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని మల్లు రవికి నాగం విజ్ఞప్తి చేశారు. ‘గెలుపు’ ఆధారంగా టిక్కెట్లు ఇస్తామని మల్లు రవి వివరించేందుకు ప్రయత్నించగా, పార్టీ సీనియర్ నేతలను విస్మరించి, పార్టీలో చేరే వారికి ప్రాధాన్యత ఇస్తే పార్టీకి ప్రయోజనం ఉండదని జగదీశ్వర్ రావు మద్దతుదారులు అన్నారు. జూపల్లి కృష్ణారావు మొదట కాంగ్రెస్ లోనే ఉండేవారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి కూడా అయ్యారు. 2018 ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన బీఆర్ఎస్ లో చేరడంతో ... జూపల్లి కృష్ణరావుకు ప్రాధాన్యం తగ్గిపోయింది. దీంతో పార్టీ నుంచి బయటకు వచ్చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాక ఏ మార్గంలో వెళ్లాలనే అంశంపై అనేక మంది అభిప్రాయాలు తీసుకున్నారు. పొంగులేటితో కలిసి అనేక సభలు సమావేశాలు నిర్వహించి, ప్రజలు ఏం కోరుకుంటున్నారనే అభిప్రాయాలు తీసుకున్నారు చెప్పారు. సర్వేలు చేయించుకున్నారు. 80 శాతానికిపైగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఉందని ఇద్దరు నేతలు చెప్పారు. ఈ మధ్య భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఖమ్మం వేదికగా పొంగులేటి కాంగ్రెస్‌లో చేరారు. దీనికి ముఖ్య అతిథిగా రాహుల్ గాంధీ వచ్చారు. జూపల్లి చేరికకు ప్రియాంక వస్తారని మొదటి నుంచి టాక్ ఉంది. చివరకు వారం రోజుల క్రితం డేట్ కూడా ఫిక్స్ చేశారు. కానీ జాతీయ రాజకీయాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రియాంక తన పర్యటన వాయిదా వేస్కున్నారు.

## అంతరిక్షంలో చంద్రుడి దరహాసం

(మొదటిపేజీ తరువాయి)

ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఇటలీకి చెందిన ఈ వర్చువల్ టెలిస్కోప్ ఖగోళానికి చెందిన పలు విషయాలను ఎప్పటికప్పుడు గుర్తించి సమాచారం ఇస్తూ ఉంటుంది. చంద్రయాన్–3 విషయంలోను ఈ టెలిస్కోప్ తన పనితనం, నైపుణ్యం ప్రదర్శించింది. చంద్రయాన్ 3 బరువు 3,921కిలోలు. భూమి నుంచి చంద్రుడి వరకూ దాదాపు 4 లక్షల కిలోమీటర్ల వరకూ ప్రయాణిస్తుంది. దీన్ని బాహుబలి రాకెట్‌గా చెప్పిన ఇస్రో ఆ తరవాత దానికి లాంచ్ వెహికల్ మార్క్ 3 గా పేరు పెట్టింది. దీని బరువు 642 టన్నులు. చంద్రయాన్ 3 ఉపగ్రహం చంద్రుడి వైపుగా తన ప్రయాణాన్ని మొదలు పెట్టింది.

చంద్రయాన్ 3 ని ఎల్వీఎం 3 రాకెట్ ద్వారా భూ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టామని తెలిపారు. మొత్తం మూడు దశలనూ దాటుకుని రాకెట్ కక్ష్యలోకి దూసుకెళ్లింది. ప్రపల్షన్ మాడ్యూల్ రాకెట్ నుంచి విడిపోయినట్టు ఇస్రో ప్రకటించింది. చంద్రయాన్ 3 ఉపగ్రహం చంద్రుడి వైపుగా తన ప్రయాణాన్ని మొదలు పెట్టిందని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. చంద్రయాన్ 3 ని ఎల్వీఎం 3 రాకెట్ ద్వారా భూ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టామని తెలిపారు. 24 రోజుల పాటు ఇది భూమి చుట్టూ ప్రదక్షిణలు చేయనుంది. ఆగస్టు 23 లేదా 24 న చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ అవుతుందని ఇస్రో అంచనా వేస్తోంది. ఇక్కడ సాఫ్ట్‌ల్యాండింగ్ అయితే...ఈ ప్రయోగం పూర్తి స్థాయిలో విజయవంతం అయినట్టు లెక్క. 3.5లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణించిన తరవాత చంద్రయాన్ 3 చంద్రుడి కక్ష్యలోకి చేరుకుంటుంది. ల్యాండర్, రోవర్ మాడ్యూల్ వేరువేరుగా ఉన్న ఈ స్పేస్ క్రాఫ్ట్ చంద్రుడి సౌత్ పోల్‌కి సమీపంలో ల్యాండ్ అవ్వనుంది.

ప్రపల్షన్ మాడ్యూల్ భూమి చుట్టూ పలుసార్లు తిరిగి చంద్రుడిపై దిగుతుంది. చంద్రుడిపై గ్రావిటీకి తగ్గట్టుగా మాడ్యూల్ మెల్లగా కిందకు దిగుతుంది. ల్యాండర్ విడిపోతుంది. లాంఛ్ అయినప్పటి నుంచి సరిగ్గా నెల రోజుల తరవాత చంద్రుడిపై మాడ్యూల్ దిగుతుంది. అయితే..చంద్రుడిపై సన్‌రైజ్ ఎలా ఉందన్న దానిపైనే ల్యాండింగ్ ఎప్పుడవుతుందన్నది ఆధారపడి ఉంటుంది. సన్‌రైజ్‌లో ఆలస్యం జరిగితే..ల్యాండింగ్ కూడా లేట్ అవుతుంది. అదే జరిగితే...ఇస్రో ల్యాండింగ్‌ని సెప్టెంబర్‌కి రీషెడ్యూల్ చేస్తుంది. కానీ...ఈ మిషన్‌లో అసలైన క్రూషియల్ పాయింట్ ఇదే. ల్యాండింగ్‌కి కనీసం 15 నిముషాల సమయం పడుతుంది. 2020 జనవరిలో ఇస్రో తొలిసారి చంద్రయాన్ 3పై ప్రకటన చేసింది. డిజైన్‌పై పని చేస్తున్నామని, త్వరలోనే స్పేస్‌క్రాఫ్ట్ అసెంబ్లింగ్ పూర్తవుతుందని అప్పట్లో వెల్లడించింది. చంద్రయాన్ 2 కన్నా పకడ్బందీదా దీన్ని డిజైన్ చేశారు. ముఖ్యంగా ల్యాండర్ లెగ్స్‌ని మరింత దృఢంగా తయారు చేశారు. నిజానికి 2021లోనే ప్రయోగించాలని భావించినా కొవిడ్ కారణంగా వాయిదా వేయాల్సి వచ్చింది. ఇక సెకండ్ వేవ్ వల్ల మరింత జాప్యం జరిగింది. అప్పటికే ప్రపల్షన్ సిస్టమ్ టెస్టింగ్ పూర్తైంది. ఇన్ని రోజుల తరవాత జులై 14న లాంఛ్ చేస్తామని ఇస్రో అధికారికంగా ప్రకటించింది.

## మరో ఐదు రోజులు వానలే వానలు

(మొదటిపేజీ తరువాయి)

వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి–కొత్తగూడెం, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. వీటితోపాటు ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాభాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, యాదాద్రి–భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.ఇప్పటికే సోమవారం రోజు నుంచి ఎడతెరిపి లేకుండా ఇప్పిటికీ వర్షం కురుస్తూనే ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద క్రమంగా వరద పెరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ లక్ష్మీ బరాజ్ కు ప్రాణహిత వరద పోటెత్తడంతో 35 గేట్లు ఎత్తి, 165,394 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తుపాకుల గూడెం వద్ద సమ్మక్క బరాజ్ కు గోదావరితో పాటు ఇంద్రావతి నది వరకు భారీగా వచ్చి చేరుతుండడంతో 33 గేట్లు ఎత్తి, లక్షా 95 వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. వర్షం కారణంగా భూపాలపల్లిలో సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ములుగు జిల్లా వ్యాప్తంగా 8.54 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా కొన్నాయిగూడెంలో అత్యధికంగా 9.84 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. బొగత జలపాతం వద్దకు పర్యాకుల సందర్శనను అటవీశాఖ అధికారులు నిలిపివేశారు. మరోవైపు రాష్ట్రంలో భారీ నుంతి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అందరూ జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల్లో అస్సలే బయటకు వెళ్లకూడదని అంటున్నారు. ఈక్రమంలోనే సీఎం శాంతి కుమారి మంగళవారం రోజు కలెక్ట్రు, అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని అన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితిని అయినా ఎదుర్కనేందుకు సిద్ధంగా ఉండేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని అన్నారు. లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల వద్ద ఉన్న వారికి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. అగ్నిమాపక శాఖతో పాటు డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి రాహుల్ ప్రతీక్షణం అందుబాటులో ఉండాలని సీస్ శాంతి కుమారి వివరించారు. “ఆకాశం పూర్తిగా మేఘావృతంగా ఉంది. ఈరోజు అంతా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం లేదా చినుకులు పడే అవకాశం ఉంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 27 డిగ్రీలు, 21 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు నైరుతి దిశ నుంచి గాలి వేగం గంటకు 10 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది” అని వెదర్ బులెటిన్ లో పేర్కొ?న్నారు. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 29.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22.1 డిగ్రీలుగా నమోదైంది. గాలిలో తేమ 95 శాతంగా నమోదైంది.

### డేంజర్ మార్క్‌ను దాటి ఢిల్లీలో యమునా నది మరోసారి ఉగ్రరూపం

గత కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర భారతదేశాన్ని వరుణుడు వణికిస్తున్నాడు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ సహా పలు చోట్ల వరదలు సంభవించాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఢిల్లీ లో యమునా నది మరోసారి ఉగ్రరూపం దాల్చింది. డేంజర్ మార్క్‌ను దాటి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. మొన్నటి వరకూ యమున ఉప్పొంగడంతో జరిగిన నష్టం నుంచి కోలుకోకముందే మరోసారి యమునమ్మ ఉగ్రరూపం దాల్చడం ఆందోళన కలిగిస్తోంది. ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో యమునా నది మరోసారి ఉప్పొంగుతోందని అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల సమయానికి ఢిల్లీ పాత రైల్వే వంతెన వద్ద యమునా నది నీటి మట్టం డేంజర్ మార్క్ ను దాటి 205.48 మీటర్లుగా నమోదైంది. ఈ సాయంత్రానికి ఇది 205.72 మీటర్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.కాగా, గత వారం యమునమ్మ ఉగ్రరూపం దాల్చిన విషయం తెలిసిందే. నది నీటిమట్టం ఆల్ టైం గరిష్ఠానికి చేరి 208.66 మీటర్లకు చేరింది. దీంతో ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. ముఖ్యమంత్రి అధికారిక నివాసం, మంత్రుల ఇళ్లు, రాజ్ భవన్, ఎర్రకోట, దేశ అత్యున్నత న్యాయ స్థానం సహా పలు ప్రాంతాల్లో వరద నీరు మోకాళ్ల లోతుకు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టడంతో యమునమ్మ కాస్త శాంతించింది. తాజాగా మరోసారి ప్రమాదకరస్థాయికి మించి ప్రవహిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## జూనియర్ కాలేజీల్లో 1,654 లెక్చరర్ల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా నియామక కమిటీ ఏర్పాటు చేస్తారు. జిల్లాల్లోని జూనియర్ కాలేజీల వారీగా ఖాళీలను ఈరోజు వెల్లడిస్తారు. అర్హతలు న్నవారు. ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. 26వ తేదీన మెరిట్ జాబితా వెల్లడిస్తారు. ఎంపికైన గెస్ట్ లెక్చరర్ల జాబితా ఈ నెల 28న జిల్లా కలెక్టర్ వెల్లడిస్తారు. ఆగస్టు 1న సంబంధిత కాలేజీల ప్రిన్సిపాళ్లకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. గతంలో జూనియర్ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లుగా ఉన్న వారిని తిరిగి కొన సాగించకపోవడంతో వారిలో ఆందోళన నెల కొంది.

## కాంగ్రెస్ ప్లేస్‌లోకి బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

లేకపోతే.. ఎద్దైనా స్టాండ్ తీసుకున్న ఏదో ఓ పార్టీ వాదనకు మద్దతుగా నిలవాల్సిన పరిస్థితో వచ్చేది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఫేట్ మారిపోయింది. కాంగ్రెస్ ప్లేస్ బీజేపీకి వచ్చింది. రేవంత్ అన్న ఒక్క మాటను మూడో సారి అధికారానికి నిచ్చెనగా వేసుకోవాలని ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ వస్తే మూడు గంటలే కరెంట్ ఇస్తుందనే ప్రచారంతో ప్రజల్లోకి వెళ్తోంది. అదే పవర్ మంటలతో కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టాలని బీఆర్ఎస్ ఎత్తుకు పైఎత్తులు వేస్తూ.. ఇటు అధికార పార్టీ బీఆర్ఎస్.. అటు ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ దూసుకెళ్తున్నాయి.. .. కాంగ్రెస్ కి మద్దతు ఇస్తే ఉచిత విద్యుత్ రద్దవుతుందని కేటీఆర్ చెబుతున్నారు. రైతన్నలకు మూడు గంటల విద్యుత్ చాలన్న కాంగ్రెస్ విధానంపైన ప్రతి గ్రామంలో చర్చ జరగాలని.. . పది రోజులపాటు రైతు సమావేశాలు జరిపుతోంది బీఆర్ఎస్. ప్రతి రైతు వేదికల వద్ద రైతు సమావేశాలు పెట్టి మూడు పంటలు టీఆర్ఎస్ నినాదం ? మూడు గంటల కరెంటు కాంగ్రెస్ విధానం పేరిట ఈ సమావేశాల్లో చర్చించాలని బిఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ ఆదేశాలిచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులు పాటిస్తున్నారు.అయితే రేవంత్ వ్యాక్యలు రివర్స్ అయ్యాయని తెలిసిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇరవై నాలుగు గంటల కరెంట్ ఎక్కడా రావడం లేదన్న విధానాన్ని తెరపైకి తెచ్చింది. బీఆర్ఎస్ ను కార్నర్ చేయడానికి ఉపయోగిచుకుంది. విద్యుత్ విషయంలో బీఆర్ఎస్ కు దీటైన సమాధానం ఇస్తూ అధికార పార్టీని ఆత్మరక్షణలో పడేసేందుకు సబ్ స్టేషన్ల వద్ద చర్చకు సవాల్ చేశారు. అధికార పార్టీని ఇరకాటంలోకి నెట్టడంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి పూర్తిగా సక్సెస్ అయ్యారు. దీన్ని రేవంత్ రెడ్డి కూడా అందుకున్నారు. ఎక్కడైనా చర్చకు సవాల్ అన్నారు. తన వ్యాఖ్యలపైనే పది రోజుల నిరసనలకు కేటీఆర్ పిలుపునివ్వడంతో రేవంత్ మరింత దూకుడుగా సవాళ్లు చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటలు కరెంట్ అందుబాటులో ఉంచుతున్నామని రైతులకు సరిపడా ఇస్తున్నామన్న వాదన తీసుకొస్తున్నారు. కానీ ఇలా చెప్పడం వెనక్కి తగ్గడమే. అయితే ఎవరూ తగ్గకుండా... కరెంట్ రాజకీయాన్ని జోరుగా నడిపించుకుంటున్నారు. పవర్ వార్‌లో తామిద్దరమే పోటీ పడుతున్నామన్న అభిప్రాయాన్ని కల్పించేందుకు బీఆర్ఎస్ – కాంగ్రెస్ పోటీ పడుతున్నాయి. తమ ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీనే అన్నట్లుగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోంది. రేవంత్ రెడ్డితో కలిసి కుట్ర పూరితంగా రాజకీయాలు కూడా తమ మధ్యే జరుగుతున్నాయన్న అభిప్రాయాన్ని కల్పిస్తున్నారు. పాత విషయాల్ని తెరపైకి తెచ్చి.. గట్టిగా పోరాడుతున్నట్లుగా కనిపించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ బీజేపీని కనిపించనీయకుండా చేస్తున్న రాజకీయంలో... ఇప్పుడు తెలంగాణ బీజేపీ నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంతర్గత పరిణామాల కారణంగా బీజేపీ నేతలు... మాట్లాడలేకపోతున్నారు. కొత్త తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు అధికారిక పనుల్లో భాగంగా విదేశీ పర్యటనకు వెళ్లారు. ఇతర నేతలకు ఈ ఇష్యూలో ఎలా స్పందించాలో స్పష్టత లేకుండా పోయింది. ఇలాంటి సమయంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ఊహించని సవాళ్లు ఎదురు అవుతున్నాయి. ఆయన ఈ పరిస్థితుల్ని అధిగమించి.. పార్టీని గాడిన పెట్టాల్సి ఉంది.

## ఓయూలో విద్యార్థుల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

చెప్పకుండానే ఓయూ అధికారులు పరీక్షలు పెడుతున్నరని ఆరోపించారు. సిలబస్ పూర్తైన తర్వాత పరీక్షలు నిర్వహించాలని పీజీ విద్యార్థులు ఆందోళన చేసారు. వీసీకి వారం రోజుల క్రితం వినతి పత్రం ఇచ్చినా నో రెస్పాన్స్. నిరసన తెలుపుదామని వీసీ ఛాంబర్ వెళ్తున్న విద్యార్థులను హాస్టల్ లోనే ఓయూ సెక్యూరిటీ బంధించింది. బుధవారం ఓయూలో జరుగుతున్న ఇంటర్నల్ పరీక్షలకు బాయ్ కాట్ చేసారు. వర్షంలోనే నిరసన కొనసాగించారు.

## మరో బండి కాబోతున్నారా..!

(మొదటిపేజీ తరువాయి)

నీరు సరిపోతాయని.. ఎనిమిది గంటల కరెంట్ రైతులకు సరిపోతుందని అమెరికాలో రేవంత్ అన్న మాటల్ని బీఆర్ఎస్ అతి పెద్ద వివాదం చేసింది. రైతులెవరూ కాంగ్రెస్‌కు ఓటు వేయకుండా .. కాంగ్రెస్ వస్తే మూడు గంటల విద్యుత్ మాత్రమే ఉంటుందన్న ప్రచారం జోరుగా చేస్తున్నారు. ఇది కాంగ్రెస్ కు డ్యామేజ్ చేస్తుందని.. బీఆర్ఎస్‌కు మేలు చేస్తుందన్న అబిప్రాయంతో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి కూడా అదే చెబు తున్నారని అంటు న్నారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీలోనే రేవంత్‌కు వ్యతిరేకంగా బలమైన వర్గం ఉంది. సీనియర్లు ఆయన తీరును వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ రెడ్డి వల్ల కాంగ్రెస్ పార్టీ ఏ మాత్రం పుంజుకోలేదని.. కానీ పుంజుకున్న పార్టీకి రేవంత్ రెడ్డి వ్యాఖ్యల వల్ల నష్టం చేకూరుతోందని... హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో బీఆర్ఎస్ పార్టీ కూడా.. రేవంత్ రెడ్డి తమ పరిస్థితి మెరుగ్గా ఉంటుందని.. ఎక్కువ సీట్లు వస్తాయన్న సందేశాన్ని రాజకీయవర్గాలకు పంపుతూండటంతో.. రేవంత్‌రెడ్డిని హైకమాండ్ తొలగింపచేసేలా రివర్స్ వ్యూహం పన్నుతున్నారన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది.

## సంపాదకీయం

# ఎన్‌డీఏ వర్సెస్ ఇండియా

విపక్ష కూటమికి కొత్త పేరు ఖాయమైంది. కాంగ్రెస్ సారథ్యంలో ఇన్నాళ్లూ కొనసాగిన యూపీఏ స్థానంలో ఇక 'ఇండియన్ నేషనల్ డెవలప్మెంటల్ ఇన్ క్లూజివ్ అలయన్స్- ఇండియా అనే కూటమి రూపుదిద్దుకుంది. విపక్ష నేతల సమావేశంలో ఈ పేరును ఖాయం చేశారు. బెంగళూరులో జరిగిన విపక్ష నేతల సమావేశంలో 26 పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీకి ప్రధాని పీఠంపైననో లేదా అధికారంపైననో ఆసక్తి లేదని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సామాజిక న్యాయాన్ని పరిరక్షించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. 2024 లో బీజేపీని ఓడించడం లక్ష్యంగా విపక్ష పార్టీలు ఏకం అవుతున్నాయన్నారు. 2024 ఎన్నికలు బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయేకు, విపక్ష 'ఇండియా' కు మధ్యనే జరుగుతాయన్నారు. బెంగళూరులో జరుగుతున్న విపక్ష కూటమి నాయకులను ఉద్దేశించి ఖర్గే తో పాటు రాహుల్ గాంధీ, మమత బెనర్జీ, ఉద్ధవ్ ఠాక్రే, అరవింద్ కేజ్రీవాల్ తదితర భాగస్వామ్య పార్టీల నాయకులు ప్రసంగించారు.అలాగే, తదుపరి సమావేశం ముంబైలో నిర్వహించాలని నిర్ణయించారు.విపక్ష కూటమికి కొత్త పేరు ఖాయమైంది. కాంగ్రెస్ సారథ్యంలో ఇన్నాళ్లూ కొనసాగిన యూపీఏ స్థానంలో ఇక 'ఇండియన్ నేషనల్ డెవలప్మెంటల్ ఇన్ క్లూజివ్ అలయన్స్- ఇండియా అనే కూటమి రూపుదిద్దుకుంది. బెంగళూరులో జరిగిన విపక్ష నేతల సమావేశంలో ఈ పేరును ఖాయం చేశారు. అలాగే, తదుపరి సమావేశం ముంబైలో నిర్వహించాలని నిర్ణయించారు.బెంగళూరులో జరగిన విపక్ష నేతల కీలక సమావేశంలో కూటమి పేరుపై నిర్ణయంతో పాటు పలు ఇతర ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఢిల్లీలో కూటమి కోసం ఒక కామన్ సెక్రటేరియట్ ను ఏర్పాటు చేయాలని, అలాగే, 11 మంది సభ్యులతో ఒక సమన్వయ కమిటీ ని నియమించాలని నిర్ణయించారు. 'ఇండియా' నేతల తదుపరి సమావేశం ముంబై లో నిర్వహించాలని నిర్ణయించారు. ఆ భేటీ ఎప్పుడు జరపనున్నది త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. సమన్వయ కమిటీ సభ్యుల పేర్లను కూడా ముంబై సమావేశంలో ప్రకటిస్తామని తెలిపారు.2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమైందని తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమత బెనర్జీ వ్యాఖ్యానించారు. విపక్ష కూటమి 'ఇండియా' ను బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఎదుర్కోలేదని, 'ఇండియా' దే ఘన విజయమని ధీమా వ్యక్తం చేశారు. 'ఇండియా' ను ఎన్డీయే ఎదుర్కోగలదా? అని ప్రశ్నించారు. 2024 ఎన్నికల పోరు ఇండియా, ఎన్డీయే అనే రెండు రాజకీయ కూటముల మధ్య పోరాటం కాదని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఇండియా అనే భావనను కాపాడే లక్ష్యంతో తమ పోరాటం ఉంటుందని రాహుల్ స్పష్టం చేశారు. 2024 ఎన్నికల పోరు నరేంద్ర మోదీకి, ఇండియా అనే ఐక్య భావనకు మధ్య జరగబోతందన్నారు.సమావేశం అనంతరం సమావేశంలో పాల్గొన్న పార్టీలు ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయి. అధికారంలోకి వస్తే కుల గణన చేపడ్తామని ఆ ప్రకటనలో స్పష్టం చేశాయి. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత లభించాలన్నది మా లక్ష్యం. ఆ లక్ష్య సాధనలో భాగంగా మొదట కుల గణన ను అమలు చేస్తాం." అని సామూహిక్ సంకల్ప్ పేరుతో విడుదల చేసిన ఆ ఉమ్మడి ప్రకటనలో వెల్లడించాయి. "దేశానికి ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక, సామాజిక, రాజకీయ ఎజెండాను తీసుకువస్తాం. విద్వేషాన్ని, మైనారిటీలు, దళితులు, మహిళలు, ఆదివాసీలు, కశ్మీరీ పండిట్ల పై హింసను ఓడించే లక్ష్యంతో మేమంతా ఒక్కటయ్యాం" అని ఆ ప్రకటనలో తెలిపాయి.'విపక్ష కూటమి భారత్ ను ప్రతిబింబిస్తుంది. అందుకే ఇండియా అనే పేరు కూటమికి సరిగ్గా సరిపోతుంది. ఈ పేరు కూడా బీజేపీ ని బాధ పెడుతుంది' అని ఆర్జేడీ ఒక ట్విటర్ పోస్ట్ లో పేర్కొంది. అయితే, కాసేపటికి ఆ ట్వీట్ ను డిలీట్ చేసింది. "2024 ఎన్నికలు టీమ్ ఇండియా కు టీమ్ ఎన్డీయే మధ్య జరగబోతున్నాయి" అని శివసేన ఉద్ధవ్ వర్గం నేత ప్రియాంక చతుర్వేది వ్యాఖ్యానించారు. దానికి స్పందనగా చక్ దే ఇండియా అంటూ టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రీన్ ట్వీట్ చేశారు. 'ఇండియా గెలవబోతోంది' అని లోక్ సభ ఎంపీ మానికం టాగోర్ ట్వీట్ చేశారు.విపక్ష కూటమిని అత్యంత అవినీతిమయమైన కూటమిగా ప్రజలు భావిస్తున్నారని మోదీ వ్యాఖ్యానించారు. "ఆ కూటమిలో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి బెయిల్ పై ఉన్నవారికి గొప్ప గౌరవం లభిస్తుంది. మొత్తం కుటుంబం అంతా అవినీతికి పాల్పడి బెయిల్ పై బయట ఉన్నవారికి మరింత గౌరవం లభిస్తుంది. అలాగే, ఒక వర్గాన్ని కించపర్చేలా వ్యాఖ్యలు చేసి జైలు శిక్ష పడిన వారికి సన్మానాలు చేస్తారు" అని ప్రధాని మోదీ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. పశ్చిమబెంగాల్ లో పంచాయత్ ఎన్నికల సమయంలో జరిగిన హింసపై, వారిపై ఉన్న అవినీతిపై ఆ కూటమిలో ఎవరూ మాట్లాడరని మోదీ వ్యాఖ్యానించారు.

## నేటి నుంచి వర్షాకాల

# పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

**21 కొత్త బిల్లులు, 7 పాత బిల్లులు**

ఈ సమావేశాల్లో పార్లమెంట్లో 21 కొత్త బిల్లులను ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. ఏడు పాత బిల్లులపై కూడా చర్చ జరుగుతుంది. వాటిలో డిజిటల్ డేటా ప్రొటెక్షన్ బిల్ కీలకమైంది. ప్రస్తుతం అమల్లో ఉన్న 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రాక్టీసెస్ అండ్ ప్రొసీజర్స్ అండ్ సెన్సిటివ్ పర్సనల్ డేటా నిబంధనల' స్థానంలో ఈ డేటా ప్రొటెక్షన్ బిల్లు వస్తోంది. వ్యక్తిగత సమాచార హక్కు ఉల్లంఘనలకు కఠినమైన శిక్షలు, జరిమానాలను ఈ బిల్లులో పొందుపర్చారు. ఇది కాకుండా అటవీ పరిరక్షణ సవరణ బిల్లు, బయోలాజికల్ డైవర్సిటీ బిల్లు, జన విశ్వాస్ సవరణ బిల్లు, మల్టీ స్టేట్ కో ఆపరేటివ్ సొసైటీస్ సవరణ బిల్లు, మీడియేషన్ బిల్లు, సినిమాటోగ్రఫీ సవరణ బిల్లు మొదలైనవి ఈ సమావేశాల్లో చర్చకు రానున్నాయిలోక్ సభ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో.. వివిధ ప్రభుత్వ విధానాలపై యుద్ధానికి విపక్షాలు సిద్ధమవుతున్నాయి. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయంతో ఉత్సాహంగా కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశాల్లో విపక్ష కూటమికి నేతృత్వం వహించనుంది. ఢిల్లీ అడ్మినిస్ట్రేషన్ అధికారాలకు సంబంధించి కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్స్ పై ఆప్ ఆగ్రహంగా ఉంది. ఆ ఆర్డినెన్స్ పై ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న కాంగ్రెస్, తాజాగా, ఆ ఆర్డినెన్స్ ను వ్యతిరేకిస్తున్నామని, ఈ విషయంలో ఆప్ కు మద్దతిస్తున్నామని ప్రకటించింది. మరోవైపు, ఉమ్మడి పౌర స్మృతి ని తీసుకువచ్చే ప్రభుత్వ ప్రతిపాదనను పలు విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా కూటమిగా నిలిచిన విపక్షాల ఐక్యతకు ఈ సమావేశాలు ఒక ఉదాహరణగా నిలవనున్నాయి. మరోవైపు, పార్లమెంటు సమావేశాల్లో విపక్షాలను ఎదుర్కోవడంతో పాటు రానున్న ఎన్నికలపై వ్యూహ రచన లక్ష్యంగా ఎన్డీఏ పక్షాలు సమావేశమయ్యాయి.

# ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి ఉండాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




జయశంకర్ భూపాలపల్లి- ప్రభాత సూర్యుడు

ఎన్నికల నియమావళి పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం కలెక్టరేట్ విడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన, తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలని, చట్టపరిధిలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుందని, ఎన్నికల నియమావళి ననుసరించి విధులు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారందరి పేర్లను ఎటువంటి పొర పాట్లు జరుగకుండా ఓటరు జాబితాలో ఓటరుగా నమోదు చేయాలని, బూతు స్థాయి అధికారులు వారి పరిధిలోని ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించాలని అన్నారు. ఓటరుగా నమోదు, మార్పులు-చేర్పులు, తొలగింపులకు సంబంధించిన సమాచారంతో పాటు అందుకు అవసరమైన సమాచారం సేకరించి నిర్ణీత ఫారాల ద్వారా పనులు పూర్తీ చేయాలని, ఎన్నికల కమిషన్ జారీ చేస్తున్న ప్రతీ అంశాన్ని ఎన్నికల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని బూతు స్థాయి అధికారులకు ఆయా సహాయ ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఓటరు జాబితా నుండి పేరును తొలగించే సమయంలో తొలగింపుకు కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని అన్నారు. జిల్లాలో 18, 19 ఏళ్ళ వయస్సు కలిగిన యువత పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయడంలో కొంత వ్యత్యాసం ఉన్నట్లు గమనించడం జరిగిందని, అలాగే 80 సంవత్సరాలకు పైబడి ఉన్న వారి పేర్ల తొలగింపునకు సమాచారాన్ని సేకరించాలని అన్నారు. ఒక ఫారంలో నమోదు చేయాల్సిన వివరాలు మరో ఫారంలో నమోదు చేయడం వలన తొలగింపునకు కారణం అవుతున్నాయని, నిర్దిష్ట ఫారాలలో పూర్తీ సమాచారాన్ని నమోదు చేయాలని అన్నారు. గత జనవరి 5 న ఫైనల్ ఎలక్టోరల్ సిద్ధం చేయడం జరిగిందని, త్వరలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండవ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం జరుతున్నదని, అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళు నిండిన ప్రతీ ఒక్కరి పేరు ఓటరుగా నమోదు చేయవలసి ఉందని అన్నారు.ట్రాన్స్ జెండర్ల సమాచారాన్ని సేకరించి వారికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఆయా బూతు స్థాయి అధికారులకు ఉందని అన్నారు. దివ్యాంగుల ఓటర్ల పేరును నమోదు చేసి ఫ్లాగ్ చేయాలని అన్నారు. జెండర్, ఇ.ఖ. రేషియో లను పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఆర్.డి.ఓ. శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్లు రామారావు, శంకర్ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికార బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్

## బీఆర్ఎస్‌ను పార్టీ ని వీడనున్న మాజీ ఎమ్మెల్యే నెమరుగొమ్ముల సుధాకర్ రావు

వరంగల్- ప్రభాత సూర్యుడు



అధికార బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకుడు నెమరుగొమ్ముల సుధాకర్ రావు బీఆర్ఎస్‌ను వీడనున్నారు. సుధాకర్ రావు గత కొద్దిరోజులుగా బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్నారు. పలుమార్లు ఎమ్మెల్సీ ఇస్తామంటూ మాటల తప్పడంతో సీఎం కేసీఆర్ తీరుపై సుధాకర్ రావు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్‌ను వీడాలని నిర్ణయించిన సుధాకర్‌రావు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీనిపై ఇప్పటికే కాంగ్రెస్ నేతలతో మాజీ ఎమ్మెల్యే మంతనాలు కూడా జరిపినట్లు తెలుస్తోంది. దీంతో సుధాకర్ రావు త్వరలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.కాగా.. ఇప్పటికే బీఆర్ఎస్‌లోని పలువురు అసంతృప్త నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు వస్తున్న వార్తలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా నిలిచాయి. గద్వాల జడ్పీఛైర్ పర్సన్ తిరుపతయ్య, మాజీ ఎమ్మెల్యే వేణుల వీరేశం, సునీల్ రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిసింది. ఇప్పటికే బీఆర్ఎస్ నేత తీగల కృష్ణారెడ్డితో ఠాక్రే సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఆయన కాంగ్రెస్‌లో చేరికపై ఇవాళ స్పష్టత రానుంది. కృష్ణారెడ్డితో పాటు ఆయన కోడలు, రంగారెడ్డి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ అనితారెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరే అవకాశముంది. అలాగే ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదరరెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, ఎనుగు రవీందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

## మెగా జాబ్ అండ్ వీసా మేళలో జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్




జగిత్యాల- ప్రభాత సూర్యుడు

విదేశాలలో, పలు ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీ రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాల్ని కల్పించేందుకు ఆగస్టు 5వ తేదీన ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ధర్మపురి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి గార్డెన్ లో మెగా జాబ్ అండ్ వీసా మేలను జిల్లా పోలీసు మరియు ఎల్. ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారి సహకారం తో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు.ఈ జాబ్ అండ్ వీసా మేళా కు సంబంధించిన పోస్టర్ బుధవారం ను జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో ఎస్పీ పోలీసు అధికారులతో కలసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులను ప్రోత్సహించాలని ఉద్దేశంతోనే పోలీస్ శాఖ ఎల్.ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారి సహకారం తో ఈ కార్యక్రమంలో నిర్వహించడం జరుగుతుందని ఇందులో 100 వరకు ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలు రానున్న ఈ జాబ్ అండ్ వీసా మేళా ద్వారా సుమారు 4000 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ప్రముఖ కంపె నీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా విదేశాల్లో ఉద్యోగాలు గురించి వివిధ కంపెనీలు రావడం జరుగుతుందని విదేశాల్లో ఉద్యోగం చేయాలనుకున్న వారికి ఇదొక మంచి అవకాశం అని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూల అనంతరం నియామక పత్రాలు అందజేస్తారని ఉత్సాహవంతులైన యువతీ, యువకులు ఈ జాబ్ అండ్ వీసా మేళా ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అర్హులైన యువతీ యువకులు పూర్తి వివరాలను తమ తమ స్థానిక పోలీస్ స్టేషన్లో స్వయంగా సమర్పించిపేరు నమోదు చేసుకోవాలని సూచించారు...ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి లు వెంకటస్వామి, రాజశేఖర్ రాజు,సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై బిఆర్ఎస్ లో చేరికలు




రంగారెడ్డి- ప్రభాత సూర్యుడు: ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నారని బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, హయత్ నగర్ మండలం మాజీ ఎంపీపీ రొక్కం భీమ్ రెడ్డి, సీనియర్ నాయకులు జక్కా రాం రెడ్డి, బొక్క మన్మోహన్ రెడ్డి, గుర్రం చంద్ర శేఖర్ రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు పోరెడ్డి నర్సింహ రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు మరియమ్మ చెన్నయ్య మరియు తుర్కయంజాల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు రొక్కం అనిత చంద్ర శేఖర్ రెడ్డి, మర్రి మాధవి మహేందర్ రెడ్డి, నారని కవిత శేఖర్ గౌడ్, బొక్క శ్రీలత గౌతమ్, బొక్క రవీందర్ రెడ్డి, కొండ్రు మల్లేష్ లు సుమారు 600 మంది కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో బుధవారం చేరారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి వారిని బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు.

## పల్లె ప్రకృతి వనాలలో పిచ్చిమొక్కలు లేకుండా ఉంచుకోవాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల- ప్రభాత సూర్యుడు

పల్లె ప్రకృతి వనాలలో పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు లేని ప్రాంతాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర అన్నారు.గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, సుందరీకరణ, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. బుధవారం రోజున కొడిమ్యాల మండలం హిమ్మత్ రావు పేట, కోరుట్ల మండలం సంగెం, మల్లాపూర్ మండలం న్యూ దాంరాజ్ పల్లి, వాల్గొండ తండా గ్రామ పంచాయతీలను ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీలలోని పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్, వైకుంఠ దామలు, సెగ్రిగేషన్ షెడ్లు, నర్సారీలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనాలలో పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు లేని ప్రాంతాలలో మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. వైకుంఠ ధామాలలో విద్యుత్, మరుగుదోడ్లు, నీటి సౌకర్యం కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని , పూల మొక్కలు నాటాలని, బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతీ గ్రామంలో మురికి కాలువలు, రోడ్లను ఎప్పటి కప్పుడు పరిశుభ్ర పనులు చేపట్టాలని అన్నారు. ఇంటింటి తడి-పొడి చెత్త సేకరణ ట్రాక్టర్ ద్వారా సేకరించాలని, సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ శేడ్లకు తరలించి వర్మి కంపోస్ట్ తయారు చేయాలని ఆయన ఆదేశించారు. జూనియర్ పంచయతి కార్యదర్శుల సర్వీసు క్రమబద్ధీకరణ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పనితీరును పర్యవేక్షించి క్రమ బద్ధికరణకు సిఫారసు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతి అధికారి దేవరాజ్, డివిజనల్ పంచాయతి అధికారులు, పంచాయతి కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స కోసం అండగా నిలిచిన మంత్రి 2.50 లక్షల రూపాయల ఎల్వోసి అందజేసి వేముల



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మున్సిపల్ కేంద్రం బోయిగల్లి కి చెందిన ఎస్. శంకర్ ఆక్సిడెంట్ అయ్యి నిమ్స్ హాస్పటల్ లో చికిత్స పొందుతున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు ద్వారా మంత్రి దృష్టికి తీసుకురాగా హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో బ్రెయిన్ కు సంబంధించిన మెరుగైన చికిత్స కొరకు 2.50 లక్షల రూపాయల ఎల్వోసి మంజూరు చేయించి...ఎల్ఓసి కాపీ ని కుటుంబ సభ్యులకు మంత్రి బుధవారం నాడు హైదరాబాద్ లో అందజేశారు. హాస్పిటల్ వారితో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి మనో ధైర్యం చెప్పారు. నిరుపేదలమైన మాకు మెరుగైన వైద్య చికిత్స కొరకు 2లక్షల 50వేల రూపాయల ఎల్ఓసి మంత్రి గారు మంజూరు చేశారని, ప్రశాంత్ రెడ్డి గారి మేలు మర్చి పోలేమని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలియజేసారు.

## రైతులకు ఐదు లక్షల భీమా

మెదక్- ప్రభాత సూర్యుడు

సిద్దిపేట జిల్లా రాఘవాపూర్ రైతు వేదికలో 24 గంటల కరెంటు, కాంగ్రెస్ పార్టీ వాఖ్యలపై నిర్వహించిన సమావేశంలో మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నాయుడు శిష్యుడు రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. తెలంగాణ అంటేనే ఒకప్పుడు కరెంట్ కోతలని గుర్తు చేశారు. కాంగ్రెస్ వాళ్లకి తెలివి ఉందా లేదా అని అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలూ ఆలోచించాలి 3 గంటల కరెంటు కావాలా? 24 గంటల కరెంటు కావాలా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ను నమ్మితే మోసపోతామని అన్నారు. కాంగ్రెస్ అంటేనే చీకటి బీఆర్ఎస్ అంటే వెలుతురని అన్నారు.ఒకడు గల్లిలో మరొకడు ఢిల్లీ లో కూర్చుని మాట్లాడుతున్నారని తెలిపారు. రైతు చనిపోతే ఐదు లక్షల భీమా ఇస్తున్నాం.. ఇలా ఎవరూ అయిన ఇచ్చారా? అని ప్రశ్నించారు. అనంతరం రాఘవాపూర్ లో ఋతు ప్రేమ కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మహిళలు తక్కువగా రావడంతో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఋతుప్రేమ అంటే ఏమిటని మహిళలకు అర్థమయ్యే విధంగా చెప్పడంలో ఆశ వర్కర్ కు ఫెయిల్ అయ్యారని మంత్రి అన్నారు. మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు కూడా ఫెయిల్ అయ్యారని తెలిపారు. నేను అనుకున్న స్థాయిలో మహిళలు రాలేదని మంత్రి హరీశ్ రావు అసహనం వ్యక్తం చేశారు.

# పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకం

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



జయశంకర్ భూపాలపల్లి- ప్రభాత సూర్యుడు

పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకం అందిస్తుందని, జూలై 31 నాటికి జిల్లాలో 713 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు రైతులను గుర్తించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. బుధవారం ఇల్లెందు క్లబ్ హౌస్ లో పండ్ల తోటలో సాగుకు తీసుకోవాల్సిన చర్యల పై జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులతో రివ్యూ నిర్వహించారు.పండ్ల తోటల సాగుకు సంబంధించి ఉపాధి హామీ పథకం కింద ఉద్యానవన శాఖతో కలిపి చేపట్టే చర్యలను వివరిస్తూ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ను అధికారులు ప్రదర్శించారు.జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ పండ్ల తోటల సాగు ప్రోత్సహించి, దానికి అవసరమైన పెట్టుబడిని రైతులకు సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా భూపాలపల్లి జిల్లాలో 713 ఎకరాలలో పండ్ల తోటల సాగు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించడం జరిగిందని తెలిపారు. 5 ఎకరాల లోపు భూమి, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ, సన్న , చిన్న కారు రైతులను లబ్ధిదారులుగా ఎంపిక చేయడానికి అర్హులని, వీరికి సబ్సిడీ పై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించడంతో పాటు పండ్ల తోటల పెంపకానికి అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వం సమకూరుస్తుందని, ఇందుకోసం ఉపాధి హామీ పథకం, పీ.ఎం.కే.వై.సి పథకాలను వినియోగించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఉద్యానవన శాఖ పంటల కింద భూపాలపల్లి జిల్లాలో ఇప్పటివరకు 559 మంది రైతులు 959 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. భూపాల్ పల్లి జిల్లాలో పండ్ల తోటల సాగు కింద మామిడి, నిమ్మ, నారింజ ,జామ, సీతాఫలం సపోటా, మునగ,డ్రాగన్, దానిమ్మ, కొబ్బరి ప్లాంటేషన్ కింద 713 ఎకరాలు ఎంపిక చేయాల్సి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పండ్ల తోటలో అంతర్ పంటలు వేసుకునే అవకాశం ఉండడంతో రైతులకు రెండు రకాలుగా ఆదాయం లభిస్తుందని, సంప్రదాయ పంటలతో రైతుల నష్టపోతున్న నేపథ్యంలో వాటి పరిష్కారంగా ఉద్యాన పంటలను సాగు చేయాలని , దీని పై జిల్లాలో రైతులకు విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారులను జూలై 31 వరకు ఎంపిక చేయాలని, వ్యవసాయ శాఖ అధికారులు ఉద్యానవన శాఖ అధికారులు సంయుక్తంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పండ్ల తోటలో సాగు కింద ఎంపికైన రైతులకు సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని, ఎస్సీ ఎస్టీ రైతులకు 100%, చిన్న సన్నకారు రైతులకు 90% సబ్సీడీతో డ్రిప్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని, జులై చివరినాటికి ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఆగస్టు నెలాఖరు వరకు డ్రిప్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి, ఉపాధి హామీ పథకం కింద గుంతలు తవ్వి పండ్ల మొక్కలు నాటడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. పండ్ల తోటల సాగు కింద బ్రతికిన ప్రతి మొక్కకు 3 సంవత్సరాల పాటు నెలకు 10 రూపాయల చొప్పున వాచ్ అండ్ వార్డ్ చెల్లించడం జరుగుతుందని , ఉపాధి హామీ పథకం కింద గుంతలు తీయడం మొక్కలు నాటడం జరుగుతుందని లబ్ధిదారుడికి మట్టి నమూనా చార్జీలు చెల్లిస్తామని, మొక్కల ఎరువులకు మూడు సంవత్సరాల పాటు ప్రతి చెట్టుకు సంవత్సరానికి 50 రూపాయలు చెల్లించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరికి ఘరిష్టంగా ఐదు ఎకరాల వరకు మాత్రం పథకం అమలవుతుందని, వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు ఉపాధి హామీ సిబ్బంది సంయుక్తంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, లబ్ధిదారుల జాబితా ఎంపిక చేసిన తరువాత ఆగస్టు 15 లోపు పండ్ల తోటల సాగుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. అవసరమైన పండ్ల మొక్కలను రిజిస్ట్రేషన్ పొందిన ప్రైవేట్ నర్సరీలు, డిపార్ట్మెంట్ నర్సరీల నుంచి కొనుగోలు చేయవచ్చని, పండ్ల మొక్కల కు సబ్సిడీ అమౌంట్ రైతులకు బిల్లు సమర్పించిన వెంటనే అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ డి ఆర్ డి ఓ పురుషోత్తం జిల్లా పరిషత్ సీఈవో విజయలక్ష్మి డిపిఓ ఆశాలత వ్యవసాయశాఖ అధికారులు ఎంపీడీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాజాసింగ్ తో ఈటల భేటీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



భారతీయ జనతా పార్టీ సస్పెండ్ చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తో బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. ఆయనపై సస్పెన్షన్ వేటు వేసి చాలా కాలం అయింది. వివాదాస్పద వీడియో యూట్యూబ్ లో రిలీజ్ చేయడంతో బీజేపీ హైకమాండ్ ఆయనను సస్పెండ్ చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఆయనపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపింది. ఆ తర్వాత కోర్టు ఉత్తర్వులతో విడుదల అయ్యారు. రాజాసింగ్ పై సస్పెన్షన్ ఎత్తి వేయాలని తర్వాత తెలంగాణ బీజేపీ శాఖ కూడా హైకమాండ్కు సిఫారసు చేసింది. కానీ హైకమాండ్ మాత్రం నిర్ణయం తీసుకోలేదు.సస్పెన్షన్ ఎత్తి వేస్తారో లేదో నన్న కంగారులో రాజాసింగ్ ఉన్నారు. ఆయన ఓ సారి టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారన్న ప్రచారం జరిగింది. ఇటీవల మంత్రి హరీష్ రావు ఇంటికి వెళ్లి మాట్లాడిన వీడియో కూడా వైరల్ అయింది. ఇతర పార్టీల నేతల్ని కలిసినప్పుడల్లా ఆయన పార్టీ మారడానిక ?రంగం సిద్ధమయిందన్న ప్రచారం జరుగుతోంది. కానీ రాజాసింగ్ మాత్రం.. తాను బీజేపీకే కరెక్ట్ అని ఇతర పార్టీల్లో ఇమడలేనని అంటున్నారు. ఈ క్రమంలో ఈటల రాజేందర్ రాజాసింగ్ ఇంటికి వెళ్లి సమావేశం కావడంతో.. ఆయన పక్క చూపులు చూడవద్దని బుజ్జగించడానికేనని అంటున్నారు.ఇటీవల గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ నాయకులపై , కార్పొరేటర్ పై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని రాజాసింగ్ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ నాయకులు పట్ల కక్షపురితంగా వ్యవహరిస్తుందని ఈటల రాజేందర్ మండిపడ్డారు. గోషామహల్ నియోజకవర్గంలో ఎలా అయినా గెలవాలని తమ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉందని ఈటల తెలిపారు. బీజేపీ నాయకులపై నమోదైన కేసులపై పోలీస్ అధికారులతో మాట్లాడుతానని ఈటల తెలిపారు. రాజాసింగ్ సస్పెన్షన్ వ్యవహారం కేంద్ర అధిష్టానం పరిధిలో ఉందని.. సస్పెన్షన్ ఎత్తివేత విషయంలో అధిష్టానం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నానని అన్నారు. రాజాసింగ్ సస్పెన్షన్ ఎత్తి వేయకపోతే.. సొంత పార్టీ పెట్టుకోవడం లేదా.. ఉద్దవ్ ధాకరే శివసేన పార్టీని తెలంగాణలో ఏర్పాటు చేసి.. అభ్యర్థిగా పోటీ చేయడం వంటి అవకాశాలను పరిశీలిస్తున్నారని అంటున్నారు. అయితే బీజేపీ నేతలు మాత్రం ఇవాళ కాకపోతే రేపైనా సస్పెన్షన్ ఎత్తి వేస్తారని.. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని.. రాజాసింగ్ కు సూచిస్తున్నట్లుగా తెలుస్తోంది.

### పొలాస ఆలయంలో ఘనంగా కుంకుమార్చన



జగిత్యాల- ప్రభాత సూర్యుడు

ప్రతిఒక్కరు సన్మార్గంలో నడుస్తూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని 108 శ్రీ చక్రసహిత లలితమాత ఆలయ ఫౌండరీ ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప అన్నారు. మణిద్వీప వర్ణనతో మంచి ప్రయోజనాలు కలుగుతాయని,భక్తితో అమ్మవారిని అర్చిస్తే అబీష్టసిద్ధి కలుగుతుందని స్వరూప పేర్కొన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని శ్రీ లలితమాత అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.ఆలయంలో మహిళలు మణిద్వీపవర్ణన పారాయణం భక్తి శ్రద్ధలతో గావించారూ. శ్రీచక్రాలకు సుహాసినులు కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా చెల్లం స్వరూప మాట్లాడుతూ సమాజంలో భక్తిభావాన్ని అలవర్చడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయాన్నారు. అమ్మ కృపా కటాక్షాలు అందరిపై ఉండాలని వేడుకున్నారు. అమ్మవారిని ఏ రూపంలో పూజించినా నిత్యం లలితా సహస్రనామ పారాయణం చేస్తూ అమ్మవారిని పూజిస్తే కార్యాసిద్ధి కలుగుతుందని పేర్కొన్నారు.మణిద్వీప వర్ణన చేయడం వల్ల అంతా మంచే జరుగుతుందని స్వరూప అన్నారు.అధిక మాసం సందర్భంగా లలితమాత అమ్మవారికి మహిళలు అధిక వాయినాలు, ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానంతరం హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. నిర్మల్ జిల్లాకు చెందిన వనిత శక్తి మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో జిడిగే లక్ష్మీనారాయణ, మార రాజేశం, రమణయ్య, మంత్రి సత్తయ్య, రేగొండ సతీష్, రమేష్ రెడ్డి, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి ,చెల్లం సత్తయ్య, నలుమాసు మహేందర్, సుహాసినిలు పాంపట్టి సులోచన,పెద్ది అశ్విని, వుటూరి కళ్యాణి, అర్చన, లక్ష్మి,సింగం పద్మ, సంధ్య, రజిత, సుజాత, వనజ, ప్రసన్న, అపర్ణతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## ఇండియా తరపున ప్రధాన మంత్రి పదవికి రేసులో మమత ?

కోల్‌కతా- ప్రభాత సూర్యుడు



రానున్న లోక్ సభ ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమి ఇండియా (ఎ.ఔ.ఆ.ఎ.ం) తరపున ప్రధాన మంత్రి పదవికి రేసులో మొదటి అభ్యర్థి పేరు తెరపైకి వచ్చింది. ఈ పదవి పట్ల తమకు ఆసక్తి లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించిన నేపథ్యంలో టీఎంసీ ఓ ముందడుగు వేసింది. గతంలో జేడీయూ కూడా తమ అధినేతను బరిలో నిలుపుతామని చెప్పింది.రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వాన్ని గద్దె దించాలనే లక్ష్యంతో ప్రతిపక్షాలు ఇప్పటికి రెండుసార్లు సమావేశమయ్యాయి. బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ ఆధ్వర్యంలో మొదటి సమావేశం జూన్‌లో పాట్నాలో జరిగింది. రెండో సమావేశం సోమ, మంగళవారాల్లో బెంగళూరులో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న 26 ప్రతిపక్ష పార్టీలు తమ కూటమికి ఇండియా (ఎ.ఔ.ఆ.ఎ.ం) అనే పేరును ఖరారు చేశాయి.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ప్రతిపక్ష నేతలను ఉద్దేశించి మాట్లాడుతూ, “మా (కాంగ్రెస్) కోసం అధికారం పొందాలనేది మా ఉద్దేశం కాద”న్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీల మధ్య విభేదాలు ఉండవచ్చునని, అయితే జాతీయ స్థాయిలో ప్రజల కోసం ఆ విభేదాలను పక్కన పెట్టవచ్చునని చెప్పారు. కాంగ్రెసేతర ప్రతిపక్ష పార్టీల మధ్య సయోధ్య కుదరాలనే ఉద్దేశంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఓ పార్టీ నేత మాట్లాడుతూ, ఖర్గే వ్యాఖ్యలను స్వాగతించారు. అతి పెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఉదారంగా వ్యవహరించడం అవసరమన్నారు. అందరినీ కలుపుకొనిపోవాలన్నారు. వామపక్ష పార్టీ నేత ఒకరు మాట్లాడుతూ, ఖర్గే ప్రసంగం ఈ సమావేశం పరిస్థితిని తెలియజేస్తోందన్నారు. ప్రధాన మంత్రి పదవికి ఎవరిని నిలుపుతారనే ప్రశ్న కూటమిని నాశనం చేసే అవకాశం ఉన్న సమయంలో ఖర్గే సకాలంలో వివరణ ఇచ్చారన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై టీఎంసీ ఎంపీ శతాబ్ది రాయ్ స్పందిస్తూ, ప్రధాన మంత్రి పదవిపై కాంగ్రెస్‌కు ఆసక్తి లేకపోతే, మమత బెనర్జీ ఆ పదవిని చేపట్టాలని తాము కోరుకుంటామని, ఆమెకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్‌లో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ శతాబ్ది రాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు.టీఎంసీ ఎంపీ శాంతను సేన్ ఏప్రిల్ నెలలో విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్తూ, మమత బెనర్జీ కన్నా మెరుగైన విశ్వసనీయతగలవారు ఎవరున్నారని ప్రశ్నించారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో మమత బెనర్జీకి అందరూ మద్దతివ్వాలన్నారు. ఆమె కన్నా ఎక్కువ అనుభవంగల నేతను కనీసం ఒకరిని చూపించండని అడిగారు. మమత నాలుగుసార్లు కేంద్ర మంత్రిగా, ఏడుసార్లు ఎంపీగా, మూడుసార్లు ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రిగా పని చేసిన అనుభవంగలవారని తెలిపారు. ప్రతిపక్షాలు ఐక్యంగా ఉండాలని టీఎంసీ కోరుకుంటోందని, అయితే తమకు హెడ్మాస్టర్‌గా కాంగ్రెస్‌ను స్వీకరించడానికి తాము సిద్ధంగా లేమని చెప్పారు.ప్రధాన మంత్రి పదవి రేసులో బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్‌ను నిలుపుతామని ఆ పార్టీ ఉత్తర ప్రదేశ్ శాఖ కన్వీనర్ సత్యేంద్ర పాల్ ఏప్రిల్‌లో చెప్పారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215